# అప్పల నరసింహచౌధరి

# THE STORY OF PASTOR A. NARASIMHA CHOWDHURI

By

JOHN CHOWDHURI

This very interesting life account of the first Pastor of the northern C. B. Mission will surely inspire many readers, not to be weary in-well doing that they may reap fruit in due season.

CLS

C. L. S.
STORIES OF TELUGU CHURCH FOUNDERS
No. 17

# ఎ. ఎస్. చౌధరి

గ్రంథకర్త
జాన్ చౌధరి

క్రైస్తవ వాఙ్మయ సమాజము

THE CHRISTIAN LITERATURE SOCIETY
*(In association with the United Society for Christian Literature)*
POST BOX 501, PARK TOWN, MADRAS 3
*and at*
MYSORE BANGALORE TIRUVALLA

G.L.
*COPYRIGHT*

*First edition* 1962

PRINTED AT THE DIOCESAN PRESS, MADRAS—1962. A8210

# అప్పల నరసింహ చౌధరిగారి జీవితము

ఉత్తర కనేడియన్ బాప్టిస్టు మిషనుల ప్రప్రథమ సంఘ పాలకులై, యనేకుల ఆది జీవితమునకు ఆధారభూతులై, అనన్య సామాన్య క్రైస్తవ జీవిత శుభ ప్రభలచే శోభా యుతులై ఆంధ్ర క్రైస్తవ సంఘ పితామహులలో జేరిపోయిన అప్పల నరసింహ చౌధరిగారి జీవిత చరిత్ర దాదాపు ముప్ప దేండ్లక్రిందట వ్రాయబడినను నిగురుపూసిన నిప్పు చందమున ప్రకాశ హీనమైయుండి పోయినది. నేడది ప్రకాశవంత మగుట ఆంధ్ర ప్రపంచమునకు ఆధ్యాత్మిక క్షేమావంత మగుటయే.

ఈయన సుప్రసిద్ధ పురుషోత్తమ చౌధరిగారి యన్నయగు జగన్నాథ చౌధరిగారి కుమారుడు. వీరి పూర్వులు వంగ రాష్ట్రమందలి మిధునపురము జిల్లానుండి శ్రీ పర్లాకిమిడి జమీందారులవల్ల ఆహ్వానితులై, వారి సంస్థానముయొక్క దక్షిణ కవాటమని పరగు తెంబూరు ముఠా మిరాసీదారులు గను, కొందరు రాజకుటుంబమున ఆస్థానపండితులుగను నుండిరి. వీరిలో బుద్ధిరాజు గంగాధర చౌధరియును నాతని కుమారుడు కూర్మనాథ ప్రసాద చౌధరియే జగన్నాథ చౌధరి గారి జనకుడు; అప్పల నరసింహగారి పితామహుడు. వీరు

భరద్వాజస గోత్రీయులు, అంగీరస భారహస్పత్య ప్రవరాన్వితులు, కాత్యాయన సూత్రధారులు, సామవేద విశిష్టులునైన గాఢ బ్రాహ్మణ శాఖకు జెంది గ్రామకరణములై వెలసిరి.

1795-వ సంవత్సర ప్రాంతమున జన్మించిన జగన్నాథ చౌధరి గారు శీతారాం జోధమహాంతిగారి కుమారికయగు రేఖామణిని పాణిగ్రహణము చేసికొనిరి. వీరికి భానుమతి, చక్రపాణి, జోగీశనాథ్, శీతారామ, అప్పల నరసింహ, ఆదిత్య నారాయణ, జానకి, గోపీనాథ్ అను కుమార్తెలును కుమాళ్లును గలిగిరి. వీరిలో అయిదవ వాడయిన అప్పల నరసింహగారే మన చరిత్ర కారులు. వీరు 1824 సం॥ తెంబూరు ముఠా మదనాపుర గ్రామమున జన్మగ్రహణము దాల్చిరి. ఈ కుటుంబమువారు బంగాళీ ఒరియా, హిందూస్థానీ, ఆంధ్రభాషల నెరిగిన పేరుగల ఆకులతంపర గ్రామ మొఖాసాదారులగు సర్దార్ ఫకీరాజు, సర్దార్ జోగిరాజులను వారు బ్రిటిషు ప్రభుత్వము వారిపై తిరుగబడినందున వారు పొందియుండిన మొఖాసా తీసివేయబడి, వారు తిరిగి లోబడిపోయిన వెనుక ఆ సంవత్సరము డిశంబరు 9 తేదిని తిరిగి వారి కా గ్రామము ప్రభుత్వపక్షమున ఎడ్వర్డ్ రసూర్ దొరగారిప్పించి వేసిరి. ఆ సందర్భమున బహుశః 1835-వ సంవత్సర ప్రారంభమున ప్రభుత్వ ఉద్యోగి కందుకూరు మల్లికార్జున పంతులుగారు లక్ష్మీ నరసన్న పేటలోనొక దర్బారు తీర్చి, గ్రామాధికారులనందుల కాహ్వానించిరి. మన చరిత్రకారుని తండ్రియగు జగన్నాథ చౌధరిగారికి 365 కీర్తనలు కంఠగీతమై యుండుటచేత వారా సభలో సంగీత కాలక్షేప మొసగిరి. అత్తరి ఆకులతంపర మొఖాసాదారు సర్దార్ ఫకీరాజుగారు నల్లని గుర్రమెక్కి ఆ సభ

కేతెంచి, జగన్నాథ చౌధరీగారి సంగీత కాలక్షేపమున కద్భుతానంద పరవశులై, మల్లికార్జనులుగారిని, జగన్నాథము చౌధరిగారిని ప్రక్కకు పిలిచి, జగన్నాథముగారి చేతిని బట్టుకొని యీయన మాకు తిరిగి ప్రసాదింపబడిన ఆకులతంపర మొఖాసాకు మిరాసీదారులుగ నుండదగిన వారని మల్లికార్జనులుగారివంక చూపు త్రిప్పి చెప్పి, తమ గ్రామమునకు మిరాసీ దారులుగ రావలెనని జగన్నాథ చౌధరి గారిని ఆహ్వానించిరి. ఈ సంఘటన వలననే యీ గ్రామమునకు చౌధరీ కుటుంబమువారు వెళ్లుటయు, అక్కడ కనేడియన్ బాప్టిస్టు మిషన్ మాతృ సంఘము స్థాపింపబడుటయు జరిగినదని క్రింది సంగతులవల్ల దెల్లమగును.

1835 సంవత్సరమున జగన్నాథ చౌధరిగారు పెంబూరు ముఠాలోని తమ మిరాసీ గ్రామములను తమ కుమాళ్లు చక్రపాణి, ఆదిత్య నారాయణ చౌధరీల వశముచేసి తక్కిన బిడ్డలతో ఆకులతంపర గ్రామము చేరిరి. అప్పుడు వారి కా గ్రామదక్షిణ దిశ "కొక్కెరజ్వాల" అను మాన్యము మిరాసీగా నియ్యబడెను. అయితే జగన్నాథ చౌధరిగారు దానిని తమ కుమార్తెయగు భానుమతికి పండిత రామక్రిష్ణ కాళీ మహంతిగారికిచ్చి వివాహముచేసిన సందర్భమున ఆమెకు అరణముగా నిచ్చివేసి, తాము తిరిగి స్వస్థానమునకు బోయెద మనినను ఆ మొఖాసాదారలు వారిని బోనియ్యక 1839 సం॥న తిరిగి మాన్యములిచ్చి యచ్చటనే నిల్పివేసి, అచ్చట క్రైస్తవ మతవ్యాప్తికై కలిగియుండిన దైవసంకల్పసిద్ధికి దోడ్పడిన వారైరి. ఆ కాలమున పురుషోత్తమ చౌధరిగారే యీ ప్రదేశమున సంచారముచేసి, అన్నగారికిని, వారి బిడ్డలకును ముఖ్యముగ

నందు మన చరిత్రకారునికిని క్రీస్తు మత ప్రబోధనము చేయుచు వచ్చిరి.

ఆ మొఖాసాదారుల యిష్టదేవత దుర్గ. అప్పల నరసింహా చౌధరిగారు ఆ దుర్గనే యుపాసించియుండినటుల క్రింది కవిత్వము వలన దెలియనగును:—

కం॥ "సారసనాభుని సోదరి
వారిజ దళనేత్రి నిను - వర్ణించుటకే
నేరుపు దెలియక యిప్పుడు
దూరితి నను బ్రోవవమ్మ - దుర్గాదేవీ."

కీర్తన

దూరితినమ్మా - దుర్గాదేవీ - దూరితినమ్మా! దూరితి నమ్మా న - న్నేరీతి నైనను - కారుణ్య దృష్టిచే కరుణింప వేయని ॥ దూరితి ॥

1. అరవింద దళనేత్ర - యఖిల సజ్జన స్తోత్రి - గిరిరాజ వరపుత్రి - జగరిమనేలు ముధాత్ర ॥ దూరితి ॥

2. అరయు నాకుల తంత్ర - పురనరులకునెల్ల - విరివిగ సిరులిచ్చి - కరుణింపవేయని ॥ దూరితి ॥

3. ధరనీదా సుండప్పల్ - నరసింహా చౌధరిని - వరతరుణా దృష్టిచే - గరుణింపవేయని ॥ దూరితి నమ్మా ॥

ఇట్లాయన అతిభక్తితో నుపాసించుచుండిన దుర్గగుడికి నిప్పంటుకొని, తలుపుచెక్కపై చిత్రింపబడి యుండినదాని రూపు మాపబడెను. ఆయన కృష్ణునికూడ నుపాసించి అతని పరమునను కీర్తనలు చెప్పెను.

బాల్యవయస్సుననే అప్పల నరసింహాగారు తిలారి గ్రామ కరణము శ్యామసుందర జోధమహాంతిగారి కుమార్తెయైన శ్రీమతి శాంతికుమారికి వివాహమున ఆబద్ధులైరి. 1857 (సిద్ధార్థి) సంవత్సరమున నీయన జనని రేఖామణి చౌధురాణి గారు దేహము చాలించిరి. అనంతరము ఆయన తన తండ్రితోగలసి, తన జ్యేష్ఠ పుత్రిక సుభద్రా చౌధరిని తన పెద్దక్క శ్రీమతి భానుమతి కాళీమహాంతి కుమారుడగు దీన బంధు కాళీమహాంతి గారికిని, సోదరుడగు గోపీనాథు చౌధరికి హరికృష్ణరాజ మహాంతిగారి కుమార్తెయగు రత్నమయి కన్యకను ఇచ్చి యేక లగ్నమున వివాహాబద్ధులుగ జేసిరి. వెనుక యీ రెండు కుటుంబములును క్రీస్తు మతస్థులగుట యీ కుటుంబ చరిత్రలో గంభీర విషయముగ నుండును.

ఆకుల తంపర గ్రామమున అప్పల నరసింహ చౌధరిగా రొక చదువుల బడి పెట్టి, ఆ గ్రామస్థులయొక్కయు, చుట్టు పట్టుల గ్రామస్థులయొక్కయు పిల్లలకు, పెద్దలకు విద్దియ గరపుచు బ్రహ్మజ్ఞాన మతమను నొక మతసిద్ధాంతములను తరచుచుండిరి. అది రాజయోగముతో సంబంధించి కొన్ని దురాచారములతో నిండియుండి, జాతి విచక్షణ లేకుండ యుండెను. అయితే పురుషోత్తమ చౌధరిగా రప్పుడు శ్రీకా కుళము, విశాఖపట్టణ మకాములనుండి ఆ గ్రామములను దర్శించుచు క్రైస్తవ మతోపదేశము చేయుచు "సత్యా శ్రయము" మున్నగు పత్రికల నిచ్చిరి. భగవాన్ బెహరాగారు ఆ పత్రిక నందుకొని అప్పల నరసింహాగారి యొక్కయు తది తరుల యొక్కయు గోష్ఠిని వంశధారా నదీతీర మందలి కొబ్బరి తోటలో నొక మూల గూర్చొని బ్రహ్మజ్ఞాన సిద్ధాంతములకు,

క్రైస్తవ మతసిద్ధాంతములకుగల వ్యత్యాసమును బరిశీలించుచు వచ్చిరి. క్రీస్తే పాపరాహిత్యుడగు అవతారమూర్తి యనియు, ఆయన కావించిన పాపాపశమన ప్రాయశ్చిత్తము వల్లనే పాపవిమోచనమగుననియు అప్పల నరసింహంగారు పూర్తిగ దెలిసికొనినంతట, ఆ సంగతి తండ్రిగారికి మరుగుగా నుంచి, గ్రామముల మిరాసీవ్యవహారములు తమ్ముడయిన గోపి నాథు చౌధరికి నేర్పి, ఆయనలోగూడ క్రైస్తవ మతమునందభి లాష కలిగించెను. ఆ బ్రహ్మజ్ఞాన గోష్ఠిలో జేరియుండిన బండి జోగి నాయుడు, లాలయ్య శతపధి మున్నగువారును క్రైస్తవ మతోపదేశము పొందియుండిరి.

1864-వ సం॥ ఫిబ్రవరి నెల మొదటి వారములో నొక నాటి రాత్రి అప్పల నరసింహంగారు తమ స్నేహితులను రహస్యముగ బిలిచి, అప్పటికి చిట్టివలసలో సంఘ పాలకులుగ నుండిన పిన తండ్రి పురుషోత్తము చౌధరిగారియొద్దకుబోయి, క్రైస్తవ మత దీక్ష గైకొని వచ్చెదనని వారితో జెప్పి చీకటితో బయలు దేరెను. అప్పుడాయన కట్టుకొనినవి కాషాయ వస్త్రములు, చేతి నొక హేమకంకణ మలంకరించి యుండెను. ఒక చలి దుప్పటి, గొడుగు, కొంచెము ప్రయాణపు ఖర్చు ఆయనయొద్ద నుండెను. ఆయన కాలినడకనే ప్రయాణము సాగించి రెండు రోజులలో చిట్టివలస చేరుకొనెను. ఆయన తాను బయలు దేరు సంగతి ముందుగా దెలుపక, తిన్నగా పురుషోత్తమ చౌధరిగారి యింటికిబోయి ప్రవేశ ద్వారమున నిలిచి "దాదా! దాదా!" యని రెండు మూడు పిలుపులు పిలుచువరకు పురుషో త్తముగారు బైటకువచ్చి, యింట నేదియో యాపద సంభవించి వచ్చెనేమో యని కుశలమడిగి "ముందు వంటచేయు నాయనా!

తరువాత యింటి సంగతులు విశదపరచెదవు కాని" యని పిన తండ్రిగారనుటయు, చెల్లెలను బిలిచి భత్యమిమ్మనుటయు అప్పల నరసయ్యగారు విని, దాదా అట్లు వద్దు అని తన మనోభీష్టము ప్రకాశింపజేసెను. పురుషోత్తముగారు తాము ముప్పదేండ్లనుండి బంధు రక్షణము కొరకు జేయుచు వచ్చిన ప్రార్థనల కానాడు ఫలితము కనబడినందున కృతజ్ఞతా పూర్వక ఆనంద పరవశులు లయినారనుట వింత విషయము కాదుగదా! అప్పల నరసింహంగారు వెంటనే జన్నిదము తీసివేసి తమ దాదా (పినతండ్రి) గారి చేతికిచ్చివేసిరి. అప్పటికి 15 దినముల క్రిందట అచ్చటి నారయంత్రశాలపై విచారణ కర్తయగు మాదాబత్తుల బ్రహ్మాజీగారు క్రైస్తవమత మంగీకరించి బంధువుల నిందలు భరింపలేకుండిన సమయమున అప్పల నరసయ్యగా రచ్చటికి వెళ్లుట వారిలో ధైర్య విజృంభణ మొనర్చెను.

1864 సం॥ ఫిబ్రువరి నెల 12 తేదిని రెవ. జే. డబ్లియు. గార్డన్ దొరగారు లండన్ మిషన్వా రవలంబించు జలప్రోక్షణ దీక్షనొసగి అప్పల నరసయ్యగారిని చిట్టివలస సంఘములో జేర్చుకొనిరి. కుమారుడు మతాంతరుడయిన సంగతి తండ్రియయిన జగన్నాథము చౌధరి గారికి తెలుపగా ఆతడు దుర్భర దుఃఖ భాజితుడాయెను.

కొన్నాళ్ల వెనుక భార్యను దోడ్కొని వచ్చుటకు అప్పల నరసింహ చౌధరిగారు పినతండ్రి పురుషోత్తము గారితో గలసి స్వగ్రామము చేరిరి. మతద్వేష వైరముచే రౌద్రాకారులయి యుండిన జగన్నాథ చౌధరిగారు తమ్ముని జూచుటతోనే నోట నొక గడ్డిపరక గరచుకొని ఓరే వంశోద్ధారకా! ఒరే వంశ

పావనా! తాఁజెడ్డకోతి వనమెల్ల జెరచినట్టు చేసినావురా! యంచు అతని కాళ్లకడ సాష్టాంగ పడెను. అన్నగారు కోప పరవశులగునప్పుడు తమ్ముడుగారు శాంతపరవశులగుట వారిలో నాచారమైయుండెను. కొంచెము కోపములు తీరిన వెనుక తమ్ముడు అన్నయొక్కయు తదితరులయొక్కయు కుశలము లడిగి తెలిసికొనెను. కొద్ది దినములలో అప్పల నరసింహంగారు భార్యతోను దాదాగారితోను తిరిగి చిట్టివలస చేరుకొనిరి. వారు బయలు వెడలుచుండినపుడు గొల్లు పెల్లున దుఃఖ ధ్వనులు వెడలెను.

ఆ సంవత్సరమంతయు క్రైస్తవమత సిద్ధాంతములను బాగుగ దెలిసికొని 1865 సం॥ లో అప్పల నరసింహంగారు తిరిగి స్వగ్రామము చేరిరి. అయితే వారు నివాసముండ స్థలము లేనందున వారి సోదరులగు గోపినాథ చౌధరిగారు మొఖాసా దారు ఫకీరు రాజుగారి నడిగి యింకొక విశాల నివేశనము సంపాదించిరి. తండ్రిగారాయన కేవిధ సహాయము చేయ కుండినను ఆ కాటక సంవత్సరములలో అప్పల నరసింహంగారు చుట్టుపట్టుల గ్రామములలో క్రీస్తుమత ప్రచారము తప్పక జరిగించుచుండిరి. నూర్చి పారవైచిన బోడి కంకులు గంగమ్మ యను సేవకి తీసికొనిరాగా, వానినుండి రాలిన గింజలు విసిరి పిండిచేసి, అరటిదుంపలు శాకములుగ మార్చి వారు తృప్తి పొందిరి. ఆయన మతోపదేశములు కొందరు గ్రహించుటయు, మతాంతరుడైనాడని కొందరు ద్వేషించుటయు సహజమై యుండెను. వంశధారా నదియొక్క ఆవలిగట్టున నున్న కొమ్మనా పల్లి మున్సబును వారి ప్రియ శిష్యుడునగు బండిజోగి నాయుడు గారి కష్టపరంపర విషయము కర్ణాకర్ణి విని పూర్వపు శిష్యు

లందరు ఆ గ్రామములో జీతములిచ్చి, తిరిగి ఆయనయొద్ద చదువుకొను ఏర్పాటు చేయుటచే ఆ క్రైస్తవ కుటుంబము కొమ్మనాపల్లి గ్రామమునకు జరిగెను. ఇప్పుడా శిష్య వర్గము రక్షణ చరిత్ర, క్రైస్తవ నీతిప్రకాశము మున్నగు గ్రంథము లను పాఠము చేయుచు వచ్చిరి.

1866-వ సం॥ జనువరి 16-వ తేదిని అప్పల నరసయ్యగారి ద్వితీయ పుత్రికయగు శారామణి చౌధరి జనించెను. ఆ నవంబరు నెలలో పురుషోత్తమ చౌధరిగారు ఆ గ్రామములలో సువార్త ప్రచారార్థము వెళ్లి రహస్య విశ్వాసులను బలపరచిరి. రెవ. జాన్ హే దొరగారి యాహ్వానముచే అప్పల నరసింహం గారు రెండేండ్లచ్చట సువార్త ప్రచారము చేసి, 1870 సం॥ లో తిరిగి స్వగ్రామమునకు బోయిరి. ఆ సం॥ డిశంబరు 3-వ తేదిని పురుషోత్తమ చౌధరిగారు ఆంధ్ర ప్రదేశము విడిచి ఒరిస్సాకు బోగా అప్పల నరసింహగారు కుటుంబ సహితముగా కటక పురికిబోయి, అచ్చటనుండిన రెవ. దాస్ అంతర్వేదిగారివల్ల మహానదిలో అవగాహదీక్ష పొంది బాప్టిస్టు వారైరి.

గురువుగారు వెళ్లి చాలా నెలలవరకు రాకుండుటచే కొమ్మనాపల్లిలో బండి జోగి నాయుడుగారు విషణ్ణులై వారి నాహ్వానించుచు వారికొక యుత్తరము వ్రాసి, అందు క్రైస్తవ నీతి ప్రకాశములోని క్రింది పద్యము పొందుపరచిరి:—

శా॥ "ఆకాశంబున బారు పక్షికిని దైన్యత్వంబుతో నేలపై
బ్రాకే చీమకు తిండినిచ్చి దయతో బాలించువాడెవ్వడో
నీకాతండె భుజింపనిచ్చి మనుపన్ నిష్ఠాతమైయుండగా
నేకాంతంబగు చింత క్రైస్తవుడ నీవేలా మదిన్
బొందగన్.

శిష్యుల విశ్వాసమును క్రైస్తవులు కాగోరు ఆశయు అప్పల నరసింహా చౌధరిగారా లేఖవల్ల దెలిసికొని, రైలుబండ్లు లేని యా కాలములన నాటుబండ్లమీంద ప్రయాణములు సలిపి యింకొకసారి స్వస్థానము చేరిరి. ఈ దూరభార ప్రయాణ ములలోను ప్రియ విహితుల ఆహ్వానములలోను, ఆదరణల లోను రాబోవు కార్యకరణకైన దైవచిత్తము ప్రస్ఫుట మగుచు మన జీవితములో సహాయదాయకమై యుండకపోదు. ఈసారి ఆయన కొన్నాళ్లు కొమ్మనాపల్లిలోనే యుండి, ఆకులతంపర లోని దమ యింటిని పూర్తిచేసి దానిలోనికి జరిగిపోయిరి. అతిథుల కందొక గదియుండెను. దాని కభిముఖముగా చిన్న భజనాలయ మొకటి కట్టిరి. ముందు అప్పల నరసింహగారి సహవాసములో నుండిన వారిలో వారి సోదరుడు గోపినాథు చౌధరిగారు పండిత భగవాన్ బెహరాగారు మున్నగువారు తాము క్రైస్తవ మత దీక్ష తీసికొనుటకు మిక్కిలి యాతురపడి, అవగాహ దీక్షయే సరియైన బాప్తిస్మమని గ్రహించి, వారలు కటకపురిలో నుండుటచేత 1872-వ సంవత్సరము పురుషోత్తమ చౌధరిగారును దాను అంతర్వేదిగారును రావలెనని కోరి నందున అప్పల నరసింహంగారట్లు వ్రాసిరి. భగవాన్ బెహరా ఒక చీటి వ్రాసి "క్రీస్తు పాపులను రక్షించుటకు లోకములో నికి వచ్చుట నిజమైతే మీరును మాకు స్నానదీక్ష నిచ్చుటకు వచ్చెదరు" అను ధైర్యకరవాక్యములు వ్రాసి ఆ యుత్తరములో బెట్టి పంపిరి.

ఆ యుత్తరమందుకొని రెవ. పురుషోత్తమ చౌధరిగారును రెవ. అంతర్వేదిదాస్‌గారును మిగుల నుత్సహించిరి. అంతర్వేది గారప్పుడు కటకములో నుండిన 41-వ దేశీయ పటాలమున

"మెస్ రైటర్"గా నుండిరి. కావున వారు రెండు నెలలు యజమానుల యొద్ద సెలవు తీసికొని 1872-వ సం॥ మందు వేసవిని పురుషోత్తమ చౌధరిగారితోను, పటాలపు క్రైస్తవ పటాలముతోను ఆకులతంపర గ్రామము చేరిరి. ఇంతమంది క్రైస్తవులను కాని, యొక మిషనెరీని కాని యీ ప్రదేశములో నెవరు చూచియుండలేదు. ప్రజలు చిత్కారములు సల్పెద రను భయము కలుగగా నవతల స్టేషనునుండి పోలీసు సిబ్బందిని పిలువనంపించిరి. ఆ పోలీసు వారిలో నొకడు భగవాన్ బెహరాగారి బంధువు డగుటచే లోలోపల బంధువులను ప్రేరే పించి, ఆతని కాళ్లు చేతులు బంధించి గదిలో దాచియుంచ నియోగించెను. అప్పల నరసింహంగా రాయనను చూడ వెళ్లగా ఆ యాగ్రహ చిత్తు లాయనను కొట్టవచ్చి, చెంబొకటి ఆయన చేత బెట్టి దానిని దొంగిలినటుల చార్జీ చేయునటుల ఆ పోలీసు వాడు పన్నాగము పన్నెను. అనంతరము వారు భగవాన్ బెహరాగారిని మధ్యాహ్న సమయమున వంశధారా నదిలో కాలియున్న యిసుక తిన్నెలపై గొరగొర ఈడ్చుకొని పోయి పర్లాకిమిడి చేర్చి కొన్నాళ్లు దాచియుంచిరి. గోపినాథ చౌధరి గారును భయపడిపోయి స్నానదీక్ష గైకొనుటకు వెనుకంజ వేసిరి.

ఎంతయో ధనవ్యయముతోను, వ్రయప్రయాసలతోను వచ్చినయీ పెద్దలు నిరాశ చేకుండలేదు కాని "ప్రభువు ముందర వ్యాజ్యము వేయుదుము" అని అప్పల నరసింహంగారితో వచించి యీరీతిగ వారికొరకు ప్రార్థించుచుండిరి. మన వృద్ధ బోధకులు వారితో వచ్చినవారు దీర్ఘసంచారము సల్పి కటక పురి కేగిరి. దేవుడు మానవులను రక్షణమార్గమునకు ద్రిప్పు

వెరవుల నెరిగినవాడు. కొలది కాలములోనే కలిగిన మహా యపాయముద్వారా ఆయన తానేర్పరచుకొనిన వారిని వారి కార్య దీక్షలో ముందంజవేయ సంసిద్ధ పరచెను. ఆ యపాయము అంగీరస సం॥ జ్యేష్ఠబహుళ 13 బుధవారము నాడు సంభవించెను.

## నదీ ప్రఘోషము

ఘోరసంగ్రామమా? కుంభి ఘీంకారమా?
తురంగహేషాహా? రణదుందుభీ రవం
బ? రంతేమిటబ్బా! మహా వంశధారా
తారాంబు లారాత్రి ప్రతాపంబు సూపెన్.

అనగా ఆకులతంపరచేరువను బారుచుండిన వంశధారా నది 1872-వ సం॥ వర్షరుతు ప్రారంభమున పొంగి గ్రామమును ముంచివేసెను. కుటుంబములను ముందుగా ఉన్నత స్థానములకు బంపివేసిరి. గోపినాథు చౌధరిగారు తమ కొట్టులోని యేబది పుట్ల ధాన్యము చెడునని కుమ్మరి మన్ను తలుపునకు మెత్తి, నిశ్చింతతో నుండగా జలప్రవాహములు హెచ్చ జొచ్చెను. ఎట్టకేల కాయన మొఖాసాదారు గారి మేడ చేరెను. అచ్చట ఎనమండుగురు మాత్రముండిరి. వారెల్ల రొక పడవనెక్కి ప్రవాహములు దాటిపోవుటకై పాపయ్యయను జాలరిని దాని నడుపగోరిరి. గోఫినాథు చౌధరిగారి చేతిలో నొకమైనపు గుడ్డ దివిటీ యుండెను. పడవ యొక లోతు నీటిసుడిలోబడెను. నావికుడు దానిని నడుపలేననియు, ఎల్లరు మృత్యువాత బడనున్నామనియు కేకవేయగా, గోపినాథు చౌధరిగారు ఆ యుపద్రవమునుండి తప్పించవలెననియు,

అప్పుడు తాను నిశ్చయముగా క్రైస్తవుడనయ్యెదననియు తనలో ప్రార్థించుకొనగా ఒక పెద్ద గడ్డిమేటు నీళ్లలో కొట్టుకొనివచ్చి, యా పడవకు తాకినందున అది యా లోతు నీటి గుండమునుండి యొడ్డునబడి యెల్లరు రక్షితులైరి. అప్పల నరసింహాగారి యిల్లుపడిపోయెను. గోపినాథు చౌధరిగారు తమ ప్రతిజ్ఞత్వరగా నెరవేర్చుకొనగోరి బండి జోగినాయుడు గారితో గలసి విశాఖ పట్టణ లండను మిషనులో జేర కొంత దూరము వెళ్లిరి కాని, నాయుడుగారి బంధువులు వారిని పట్టుకొని వెనుకకు దీసికొని పోయిరి. అనంతరము భగవాన్ బెహరాగారును గోపినాథు చౌధరిగారును కటకము వెళ్లి యచ్చట క్రైస్తవ మతదీక్ష స్వీకరింప నిశ్చయించగా అప్పల నరసింహంగారు కటకము నందుండిన పురుషోత్తం, అంతర్వేదిగార్ల కా విషయము వ్రాసిరి. 1873-వ సం॥ మే నెలలో పర్లాకిమిడి లో కలరా విశేషముగ నుండినను, గోపినాథు చౌధరిగారు కుటుంబమును పాటికోటలోని కన్నవారి యింటికి బంపించివేసి తాము ప్రయాణమునకువలయు బట్టలమూట పట్టించుకొని బయలు వెడలగా మొఖాసాదారు సర్దార్ శ్యామ ఘనరాజుగారు వారి వెంటబయలుదేరిరి. ఇద్దరును పర్లాకిమిడిలోని మఠములో బసచేసిరి. భగవాన్ బెహరాగా రొక మధ్యాహ్న సమయమున మఠమునకు వెళ్లిరి. గోపినాథు చౌధరిగారు బట్టల మూట పట్టుకొని వెడలిన యెడల శ్యామఘనరాజుగారు అనుమానించి, ప్రయాణభంగము కలుగజేయుదురేమో యనుభయముతో ఆ మూట చూచుచుండుడని మాత్ర మాయనతో జెప్పి కట్టుబట్టలతో బయలు వెడలిరి. ఈ యాత్రికులిద్దరు త్వరగా పట్టణము దాటిపోయిరి. వారికడ

త్రాడొకటియు, చెంబును, కట్టుబట్టలును ప్రయాణపు ఖర్చు మాత్రముండెను. దూరభార ప్రయాణము చేయవలసి యుండెను. యేసుప్రభువుయొక్క సిలువ మార్గమువారు స్మరించుకొని, ప్రయాణ కష్టములకు వెరువక, జాతి గోత్రములను దలపక, మిక్కిలి ప్రయాసతో చిలక సరస్సు దాటి పూరీజగన్నాథము చేరుకొనిరి. అప్పుడచ్చట పురుషోత్తము గారును అంతర్వేది గారును క్రైస్తవులు కొందరును వీరి రాకకై వేచియుండి, అత్యంతానందముతో వారిని జేరదీసి కటకపురికి గొనిపోయిరి.

ఇచ్చట క్రైస్తవ మత సత్యములలో తగిన తరిబియతు పొందినంతట తమ జన్నిదములు తీసివేసి యిద్దఱును 1873-వ జూలై నెల 1-వ తేదిని మహానదిలో రెవ. దాస్ అంతర్వేదిగారి వల్ల క్రైస్తవ అవగాహ దీక్షపొందిరి. కొన్నిమాసము లచ్చట నుండినతరువాత ఈ నూతన విశ్వాసులిద్దరు ఆకులతంపర గ్రామమునకు వెడలనున్నప్పుడు 41-వ సం॥ పటాలపు సంఘమువారు అప్పల నరసింహా చౌధరిగారు ఆకుల తంపరలోని చిన్న క్రైస్తవ బృందమునకు పాలకులుగ నుండవలెనని నిర్ధారణచేసి, రాత్రి భోజనాచారము జరిపింప వలయు పాత్రలును, బెత్తమల్లిన బుడ్లలో ద్రాక్షారసమును పంపించిరి. ఆ సంవత్సర శీతకాల ప్రారంభమున వారిద్దరు స్వగ్రామముచేరిరి.

అప్పటి కా గ్రామమున అప్పల నరసింహా చౌధరిగారు వారి భార్య శాంతికుమారి చౌధరాణిగారు, జంగం గంగమ్మగారు (ఈమెయు కటకపురిలో 1871-వ సం॥ లో స్నానదీక్ష పొందినది) గోపీనాథు చౌధరిగారు, భగవాన్ బెహరాగారు అను అయిదుగురు బాప్టిస్టు క్రైస్తవులుండిరి. 1873 అక్టోబరు లేక నవంబరు

మాసమున వారలొక సంఘముగ నేర్పడిరి. అప్పల నరసింహా చౌధరిగారు వారి పాలకులు. ఇట్లు కనేడియన్ బాప్టిస్టు మిషనులో నిదియే ప్రథమ సంఘముగాను, ఈయనయే ప్రథమ స్వతంత్ర సంఘపాలకులుగను పరిగణింపబడిరి. గోపినాథ చౌధరిగారు గ్రామ మిరాసీ వృత్తికి మొఖాసాదారులు ప్రథమమున గొన్ని యాటంకములు కల్పించినను వారి మాన్యములతోసహా వారి కా పదవి తిరిగి యప్పగించిరి. భగవాన్ బెహరాగారు దేశీయ వైద్యులైయుండి, మొఖాసాదారులవల్ల పొందిన మాన్యమునుండి వచ్చిన రాబడి వల్లను, వైద్య వృత్తి వల్లను, జీవించుచుండిరి. అప్పల నరసింహంగారికికూడ చేరువ గ్రామములలో కొద్ది రాబడిగల భూవసతులుండెను. ఆ కాలమున అంతర్వేదిగారి సిఫారసుచే పాతపట్టణము నీలిఫ్యాక్టరీ యధికారి సి. వాస్ దొరగారు అప్పల నరసింహంగారును, భగవాన్ బెహరాగారును ప్రతివారము తమ ఫ్యాక్టరీ కూలీలకు సువార్త ప్రకటించి వెళ్లవలెనని కోరగా వారటుల 8 మైళ్ల దూరము ప్రయాణముచేసి వచ్చుచు మతప్రబోధముచేసి వెళ్లుచుండిరి. వాస్ దొరగారు వారికి గొంచెము ధనసహాయము చేయుచు వచ్చిరి.

1876-వ సంవత్సరము జూలై నెల 28-వ తేదిని కనేడియన్ బాప్టిస్టు మిషనెరీ డబ్లియు. ఎఫ్. ఆరంస్ట్రాంగ్ దొరగారు పర్లాకిమిడిని దమ వాసస్థానముగ జేసికొని ఆకులతంపర లేకపత్రపుర గ్రామమును దర్శించుచు అప్పల నరసింహ చౌధరిగారి యింటనే బసచేయుచుండి యచ్చట చిన్న క్రైస్తవ బృంద సహవాస సౌఖ్యమనుభవించుచుండిరి. అప్పల నరసింహంగారికి పుత్రసంతతి లేనందున 1876 సం॥ ఏప్రిల్ 20-వ తేదిని జన్మించిన

హారిసోదరుని కుమారుని దత్తత చేసికొనిరి. ఒకనాడు తల్లి యింట లేని సమయమున పసిబాలుడు పరుండిన ఉయ్యేల మంచము తెగి దానిక్రింద బడియున్న బాలుడు గిజగిజ గించుకొని యేడ్చుచుండగా, ఆతని రక్షింప కనాడా దేశమునుండి పంపబడిన దేవదూతయో యను నటుల రెవరెండ్ ఆరంస్ట్రాంగ్ దొరగారు ప్రక్కగదిలోనుండి పరుగిడిపోయి యాతని పైకెత్తి కాపాడి, తల్లిగారి కప్పగించిరి. ఇట్లు రక్షింపబడిన బాలుడే యీ చరిత్రరచయిత.

ఆరంస్ట్రాంగ్ దొరగారు వచ్చినప్పటికే పై బోధకు లిద్దరును వారికి సిద్ధాన్నముగ లభించిరి. అంతర్వేదిగా రా సంవత్సరమే పటాలముతో విజయనగరము చేరినందున ఆరంస్ట్రాంగు దొర గారు వారికి వ్రాసి అప్పల నరసింహం చౌధరి, భగవాన్ బెహరా గార్లను 1876 సం॥ ఆగస్టునెల నుండి కనేడియన్ మిషన్ బోధకులుగ దీసికొనిరి. ఇప్పుడు మరికొందరు నూతన విశ్వాసులు మతదీక్షపొంద నుండుటచేతను, సంఘమింక అంతర్వేదిగారి వశమందుండినందునను అప్పల నరసింహంగారు అప్పటికి బరంపుర బాప్టిస్టు సంఘ పాలకులుగనుండిన పురుషోత్తమ చౌధరిగారిని, విజయనగర మందుండిన అంతర్వేదిగారిని, ఆరంస్ట్రాంగు దంపతులను పిలువనంపించిరి. ఈసారి జలదీక్ష గైకొనిన వారలు గోపినాథ చౌధరిగారి భార్య రత్నమయి చౌధరి, భగవాన్ బెహరాగారి భార్య రత్నమణి బెహరా, ఆయన కుమారిత ముక్తామణి (వెనుక ముక్తా మల్లిక్) బండి జోగి నాయుడు, చల్లా అప్పయ్య నాయుడు అనువారలు. ఈసారికూడా ప్రజలు చిత్కారములు జరిగించెదరను భయముండుటచేత అంతర్వేది గారు పోలీసుభటులను పిలువగా గంగాసింగను వారి యిన్

స్పెక్టరుతో కొంత సిబ్బంది వచ్చిరి. నూతన విశ్వాసు లెల్లరి కొరకు వారు అవగాహదీక్ష పొందకముందు జాతి పరిత్యాగ సూచనగా సంఘపాలకుని యింటనొక విందు చేయబడెను. ఆ సంకీర్ణ భోజనానంతరము చేతులు కడుగుకొనుచుండగా జోగి నాయుడుగారి బంధువులు భీషణరోషాయత్తచిత్తులై వచ్చి ఆయన నెత్తుకొనిపోయిరి. చల్లా అప్పయ్య నాయుడుగారి భార్య యగు అన్నమ్మ బలవంతముగా భర్త నెత్తుకొనిపోయెను. తక్కిన ముగ్గురు యువతులు ఆ జూన్ నెల 10 తేదిని ప్రథము లుగ అంతర్వేదిగారిచే వంశధారా నదిలో క్రైస్తవ జలదీక్ష గైకొనిరి. ఆరంస్ట్రాంగు దొరసానిగారు వారిలో నొక్కరు నీళ్లలోనుండి యొడ్డునకు వచ్చుచుండగా, "మరణములోనుండి జీవములోనికి వచ్చితిరి" యని ప్రోత్సాహకర వాక్యములు చెప్పిరి. అంతర్వేదిగారి పటాలము బర్మా వెళ్లుట కుత్తవులురు వచ్చియుండుటచే 8 గురు గల ఆ మాత్ర సంఘమును అంత ర్వేదిగారు కనేడియన్ మిషన్‌వారి పరముచేసిరని 1877 సం॥న మిషన్ రిపోర్టులో గలదు. ఆ చిన్న సంఘ మా కాలమున అన్యోన్య ప్రేమ పాశాను బద్ధమై వెలయసాగెను.

ఆరంస్ట్రాంగు దొరగారికి పర్లాకిమిడిలో మన్యజ్వర బాధ హెచ్చ జొచ్చుటచే వారు శ్రీకాకుళమునకు దమ కార్యస్థానము మార్చుకొనిరి. అప్పల నరసింహం చౌధరిగారు వారికి మున్షీగను, ప్రచారకులుగలు కొన్నాళ్లు శ్రీకాకుళములో గడిపిరి.

ఇప్పడు సారవంతము సస్యవంతముగనుండు జయపుర ప్రదేశములోని లూథరన్ మిషన్ వారికేదారములు నామ రూపములు లేకుండినపుడు విశాఖపట్టణ వాస్తవ్యులయి యుండిన పోలీస్ ఇన్‌స్పెక్టరు సామ్యేల్‌పాల్‌గా రా ప్రదేశమున

ఒరియాలో క్రైస్తవ మత గ్రంథములు వితరణము గావించిరి. కొట్టుపాడిలో శ్రీకృత్యబాస్ మహాంతి ఆయన భార్యయగు శ్రీమతి గెల్లామోణి మహాంత్యాణి శ్రీ సత్యవాది పట్నాయక్ గారు తామందుకొనిన దైవగ్రంథములు చదువుకొని క్రైస్తవ మతోపదేశము పొందగోరిరి. ఆ సంగతి విజయనగరములో నప్పుడు మిషనెరీగనుండిన రెవ. ఆర్. సాన్ఫర్డు దొరగారు తెలిసికొని ఒరియాభాష నెరిగిన అప్పల నరసింహ చౌధరి గారిని భగవాన్ బెహరాగారిని దమతో వెళ్లుటకు పిలువ నంపించిరి. వన్యమృగ కిరాత నిరంతరంబయిన యేజెన్సీ ఘాటీలపై వారు ప్రయాణము చేయసాగిరి. సాన్ఫర్డు దొరగారొక పల్లకీలో ముందుగా వెడలిరి. ఈ మత ప్రబోధకు లిద్దరొక కాపటివాని కుదుర్చుకొని 1878-వ సం॥ జనువరి మాసాంతమున ప్రయాణమైరి. అప్పల నరసింహంగారికి ఆకస్మికముగా కాలి మడిమెలో నొప్పి లేచి యది వ్రణముగా మారెను. ఆయన యా రాళ్లపైని కొంతసేపు ఒంటికాలి తోను చేతులతోను ప్రాకుచు, ఒకతడవు భగవాన్ బెహరా గారిమీద ఆనుకొని ఒంటికాలితో కుంటుకొనిపోవుచు దుస్సహబాధచే ఆర్తధ్వని చేయుచు, దేవునికి మొరబెట్టుకొనుచు సాయంకాలము సరి కొక యాశ్రమము చేరుకొనిరి. పెద్దపులి భయముచే ఆ యాశ్రమ వాసులు ప్రొద్దుండగనే తలుపు వేసికొనియుండి, యీ బాటసారుల మాటలు వినిరి. అందొకడు వారికి చిరపరిచితుడగు పర్లాకిమిడి కానిస్టేబులు, ఆతడు త్వరలో తలుపు విప్పి వారిని లోపలికి లాగికొనెను. అంతలోనే యా వ్యాఘ్రము మాసాలలో దూరి యొక దూడను పట్టుకొనిపోయెను. ఆ రాత్రి అప్పల నరసయ్యగారు జ్వరబాధితులైరి. ఉదయము

భగవాన్ బెహరాగారు కూలివారిని కుదుర్చుకొని వారిచే అప్పల నరసింహంగారిని మోయించుకొని కొట్టుపాడి గ్రామము చేసిరి. అక్కడ సాన్ఫర్డు దొరగారు చికిత్సచేయగా ఆ బాధితుడు స్వస్థత జెందెను. వారా ప్రదేశములో రెండు మాసములు ప్రచారము సలిపిరి. అత్తరిపై ముగ్గురు క్రీస్తు మత స్వీకారముచేసిరి. వారిలో సత్యవాది పట్నాయకుగారు ఆచార్యునిగ వెనుక అభిషిక్తులైరి. అనంతరము మరి యొకసారి అప్పల నరసింహగారును, భగవాన్ బెహరాగారును కటకము వరకు ప్రయాణముచేసి సువార్త ప్రచారముచేసిరి.

'సుఖానిత్య దుఃఖానిత్య, చక్రవత్ పరివర్తంతే' యనునటుల సుఖదుఃఖములు ప్రత్యేక వ్యక్తిజీవితమున గలుగుచు వారి జీవితాశయములను ప్రకాశింపజేయుచునే యుండును. పై కష్టానుభవమును, ఆధ్యాత్మిక సుఖానుభవమును కలిగినంతట తిరిగి అప్పల నరసింహ చౌధరిగారి సేవఫల ప్రదమయి ఆనందదాయక మాయెను. 1878-వ సం॥ వారి ప్రియ శిష్యుడగు కొమ్మనాపల్లి గ్రామ మున్సబు, ధనికుడగు భూస్వామియునగు బండి జోగి నాయుడు గారు బాప్తిస్మదీక్ష గైకొన గోరిరి. ఆయనతో గూడ భగవాన్ బెహరాగారి కుమారిత కన్యా శ్రీమతి బెహరాయు అప్పల నరసింహంగారి కుమారిక కుమారి శారామణి చౌధరియు, సోదరుని కుమారుడు జేమ్సుబాబు చౌధరియు స్నానదీక్ష గైకొన సంసిద్ధులైరి. అప్పుడు రెవ. ఆరంస్ట్రాంగ్ దొరవారు, మరికొందరు క్రైస్తవులు పత్రపుర గ్రామముచేరిరి. 1878-వ సం॥ అక్టోబరు 23-వ తేదిని కొమ్మనాపల్లి గ్రామమున కభిముఖముగా వంశధారా నదిలో వారెల్లరు ఆరంస్ట్రాంగు దొరగారి

ద్వారా అవగాహదీక్ష గైకొనిరి. అయితే బండి జోగినాయుడు గారు దీక్షపొంది నీళ్లలోనుండి పైకి వచ్చుటతోనే ఆయన బంధువు లాయన నెత్తుకొనిపోయి ప్రభుభోజన ప్రసాదమున గాని, క్రైస్తవుల భోజన భాజనములలోగాని బాల్గొనకుండ కొంతకాల మాయనను నిర్బంధపరచి యుంచిరి. మన సంఘ పాలకుడు మాత్రము జోగినాయుడుగారిని తరుచుగా దర్శించుచు ఆయనను క్రైస్తవ విశ్వాసమందు సర్వవిధముల బలపరచుచు వచ్చెను.

అప్పల నరసింహ చౌధరిగారిని చూచి ఆయనతో సహవాసము చేసియుండిన బండి లచ్చన్ననాయు డొకసారి నేను మా గురువుగారిని చూచిన తరువాత మరి క్రీస్తు వారిని చూడనవసరము లేదనెను. ఒకసారి యొక సంతలో ఆయన ప్రసంగించుచుండ ఆయన ముఖము దేవదూత ముఖమువలె ప్రకాశించెనని భగవాన్ బెహరాగారు తెల్పిరి.

ఇప్పుడు మనము ఈ సంఘపాలకుని జీవితాంత్యదశను గూర్చి చదివెదము. మంచి మరణ మెల్లరికిని రాదు. మృత్యు వనేకులకు భయంకరము. కాని క్రీస్తు భక్తుల కది ఆనంద లోక ప్రవేశద్వారము.

1879-వ సంవత్సరము జనువరి నెల 10-వ తేది శుక్రవారమునాడు అప్పల నరసింహ చౌధరిగారు తమ కాయిలా పడకమీద నుండగా చుట్టు పట్టుల గ్రామముల వారాయనను చూడ రాగా ఒక్కొక గుంపొక సారి లోపల బ్రవేశించిరి. అప్పుడాయన వారికి ప్రభువు విషయమై సాక్ష్య మిచ్చెను. అందరి వెనుక స్నాన దీక్షపొంది, క్రైస్తవ సంఘ మున జేరకయుండిన బండి జోగినాయుడుగారు వచ్చి యెదుట

నిల్చిరి. పాలకు డాయనవైపు చూపు త్రిప్పి—జోగులూ నీ వెన్నటికైన క్రీస్తు సంఘమున చేరకొానెదవని నేను రూఢిగ నమ్ముచున్నాననెను. అంతట అప్పల నరసింహంగారికి గుండెలో ఆయాసము హెచ్చుజొచ్చగా వారి సోదరులగు గోపీనాథు చౌధరిగారిమీద నొక చేతిని భగవాన్ బెహరాగారిమీద నొక చేతిని నిల్పి "యోనావలె, యోనావలె, యోనావలె" అని ముమ్మారు పలికి ప్రభువునకు తమ ప్రాణము లర్పించిరి. ప్రియ జనములంతట ప్రేమ పూరిత బాష్పజలము లొలికించిరి. యోనా మత్స్య గర్భమునుండి పైకి వచ్చినటుల తానును పునరుత్థానమున ప్రభువుతో లేచెదనని వారి తాత్పర్యమై యుండును. అయితే యంతమంది జనములకు సువార్త చెప్పిన ఆయాసముచే ఆయన చివరిగా మరేమియు చెప్పలేక పోయిరి. ప్రభువునందు మృతులు ధన్యులు. అప్పల నరసింహ చౌధరిగారి వెనుక వారి సతీమణి 1885-వ సం॥ ప్రభువునందు నిద్రించెను. అప్పటికి వారి జ్యేష్ఠ పుత్రిక సుభద్రా కాళీమ హాంతి ప్రభువునందు విశ్వాసినియే కాని సంఘమున జేరియుండ లేదు. అయితే కొలదికాలములో ఆమెయు, ఆమె భర్త దీనబంధు కే. మహాంతిగారును, ఆమె నలుగురు కుమాళ్లును క్రైస్తవులైరి. వీరిలో జ్యేష్ఠుడగు అప్పన్న (అర్పణ) యను మారు పేరుగల రెవ. ఆల్‌ఫ్రెడ్ జేమ్సు కే. మహాంతిగారు దాదాపు ముప్పదేండ్లు తాతగారు సేవచేసిన, ప్రదేశములలో సంఘపాలకులై గతించిరి. వీరి ద్వితీయ పుత్రుడు అబ్రహాం మహాంతిగారు తాతగారి కార్య ప్రదేశముననే చాల సంవత్స రములనుండి క్రైస్తవ మత ప్రచారము చేయుచున్నారు. ఇంకొక దౌహిత్రుడగు డేవిడ్ జేమ్సు కాళీ మహాంతి రైల్వే

గార్డుగనుండి పూర్వము తన యవ్వ భానుమతికి చౌధరివారు సమర్పించిన భూవసతి గలిగి తన కుంటుంబముతో పర్లాకిమిడి క్రైస్తవ సంఘమునకు సహకారిగ నున్నాడు. ఈతని జనని పర్లాకిమిడి రాజగృహమందలి స్త్రీలకును సువార్త ప్రకటించెను. జనకునివలె నామెయు కలకత్తా మొదలు గంజాంవరకును స్వతంత్రముగా సువార్త ప్రచారముచేసెను. అప్పల నరసింహ చౌధరిగారి ద్వారా క్రైస్తవులయిన బండి జోగి నాయుడుగారి కుటుంబమున వారి కుమాళ్లు జీవరత్నం నాయుడుగారు మున్నగు వారు క్రైస్తవ మండలమునకు మందసమైయున్నారు. ఉత్తర కనేడియన్ భాప్టిస్టుమిషన్ ప్రథమ బోధకులగు అప్పల నరసింహ చౌధరిగారి ప్రేమయే వెనుకటి కాలమున నింక మరి కొందరిని క్రైస్తవ మార్గమున కాకర్షించెను. ఆయన ఆదర్శబోధకుడని సుప్రసిద్ధిగాంచెను. వీరి ద్వితీయ పుత్రిక సంతానమంతయు క్రైస్తవులయి యున్నారు. వీరివల్ల క్రీస్తు సువార్త వినిన జోగి నాయుడుగారి బంధువులలో పంగ బైరాగిగారు, పంగ అప్పన్న గారు, పంగ నారాయణదాసుగారు వారు మృతులైన 'వెనుక క్రైస్తవులై, వారి సంతతివారును మంచి పదవులలోనుండి ప్రభువును మహిమపరచుచున్నారు. బీజ విక్షేపకు లొకరు, ఫలితసంచయు లొకరైనను విత్తువారి సేవయే ప్రాధాన్యమైన దనవచ్చు పత్రపురమున నీ పాలకుని వెనుక వారి కుటుంబము వారు నేటికిని సంఘసేవ సాగించుచున్నారు. బాబు దాని యేల్ చౌధరిగారును వారి బిడ్డలును అచ్చట క్రీస్తు ధ్వజము నిల్పియున్నారు. డాక్టరు జాన్ హే గారి కాలమునుండి చాలా మంది మిషనెరీలును సోదరులగు ఎస్. ఫాక్సు దొరగారును ఆ స్థలము దర్శించి క్రీస్తు సువార్త ప్రచురించిరి.

---